అకాలవర్షం... నగరమంతా చల్లదనం

చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గత రెండువారాల్లో ఎండవేడితో అవస్థలు పడుతున్న నగరవాసులకు ఉపశమనం కలిగేలా గురువారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. కన్నియాకుమారి సముద్రతీర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లోనూ పుదుచ్చేరిలోను అక్కడక్కడా వర్షాలు కురిశాయి. నగరంలోఇ తాంబరం, పల్లావరం, గిండి, కోయంబేడు, అన్నానగర్, పోరూరు, వానగరం, పెరంబూరు, మాధవరం, అరుంబాక్కం తదితర ప్రాంతాల్లో పావుగంటకు పైగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. ఇదే విధంగా నీలగిరి, కోయంబత్తూరు, తిరుప్పూరు, ఈరోడ్, తేని, దిండుగల్, మదురై, విరుదునగర్, తిరునల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారి జిల్లాల్లోనూ చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. చెంగల్పట్టు జిల్లాలో గురువారం వేకువజాము 3 గంటల ప్రాంతంలో ఆకస్మికంగా భారీగా వర్షాలు కురిశాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరంలోనూ, నగర శివారు ప్రాంతాల్లోనూ ఉదయం 11 గంటల దాకా చల్లటివాతవారణమే నెలకొంది.



సర్వాలంకరణలో కపాలీశ్వర స్వామి

కపాలీశ్వరాలయంలో పంగుణి ఉత్సవాలు

● ఘనంగా ధ్వజారోహణం

ప్యారీస్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లోని ప్రసిద్ధ శైవక్షేత్రం కపాలీశ్వరాలయంలో వార్షిక పంగుణి ఉత్సవాలు గురువారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. కర్పగాంబాళ్ సమేత కపాలీశ్వరాలయంలో పది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. పంగుణి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం గ్రామదేవత పూజలు నిర్వహించారు. రాత్రి 10 గంటలకు నెమలి వాహనంలో స్వామివారిని కొలువుదీర్చి భక్తులను దర్శనానికి అనుమతించారు. అనంతరం కల్పవృక్ష వాహన సేవ, మహా దీపారాధన నిర్వహించారు. వచ్చే శనివారం అధికార నంది వాహనంలో స్వామివారు పుర విహారం, 9వ తేది రథోత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన 63 నాయన్మార్ల ఊరేగింపు 10వ తేదీ, 11న తిరుకల్యాణోత్సవం, 13న ఉమామహేశ్వరుడి దర్శనం, 14న మహా అభిషేకం, అర్చన పూజలతో పంగుణి ఉత్సవాలు పూర్తిచేయనున్నారు. ఈ పది రోజుల ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉండడంతో ఆలయ యాజమాన్యం, పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. ఈ నెల 12వ తేది వరకు కపాలీశ్వర ఆలయ మాడవీధుల్లో వాహన రాకపోకలను నిషేధించారు. ధ్వజారోహణంలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



ధ్వజారోహణం చేస్తున్న దృశ్యం



శాసనసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నైలో కార్ల్ మార్క్స్ విగ్రహం

● అసెంబ్లీలో ప్రకటించిన సీఎం

చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి' అంటూ పిలుపునిచ్చి సోషలిస్టు భావాలను వ్యాపింపజేసిన ప్రముఖ సోషలిస్టు విప్లవ కారుడు, సామాజిక వేత్త కార్ల్‌మార్క్స్‌ను భావితరాలు గుర్తుంచుకునేలా రాజధాని నగరం చెన్నైలో ఆయనకు నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు శాసనసభలో గురువారం ఉదయం 110వ సభానిబంధన కింద ఓ ప్రకటన చేశారు. చరిత్రలో ఎంతోమంది జన్మిస్తారని, పలువురు తమ వంతు సేవలందించి చరిత్రలో స్థానం సంపాదించుకుంటారని, అయితే చరిత్ర గమనాన్నే మార్పు చేసిన ఘనత కార్ల్‌మార్క్స్‌కే దక్కిందని కొనియాడారు. కార్ల్ మార్క్స్ సంస్మరణ దినమైన మార్చి 14నే శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు చెప్పారు. వివిధ కులాల వారు,, మతాల వారు నివశించే భారతదేశం భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్నప్పటికీ ఎప్పుడో ఒకప్పుడు భారతీయులంతా పునర్వికాసం చెందుతారని కార్ల్‌మార్క్స్ తన రచనల్లో పేర్కొన్నారని స్టాలిన్ గుర్తు చేశారు. ఆ కారణంగానే మార్క్స్ - ఏంజెల్స్ రచించిన కమ్యూనిస్టు పార్టీ ప్రకటనను మొదటిసారిగా తమిళంలో అనువదించి 1931లోనే ద్రవిడ ఉద్యమ నేత పెరియార్ వెలువరించారని, అంతటి మహామేధావి కార్ల్‌మార్క్స్ విగ్రహాన్ని రాజధాని నగరం చెన్నైలో ప్రతిష్ఠించడం సమంజసంగా ఉంటుందన్నారు. వందేళ్ల క్రితమే కార్మిక సంఘాల ఉద్యమం తీవ్రరూపం దాల్చిన చెన్నై నగరంలో కార్ల్‌మార్క్స్ విగ్రహం ఏర్పాటు చేయడం కూడా సముచితంగా ఉంటుందని సభికుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు.

మూక్కయ్యదేవర్‌కు స్మారకమండపం..

ఉసిలంపట్టిలో స్వాతంత్ర్య సమరయోధుడు మూక్కయ్యదేవర్‌కు స్మారక మండపం నిర్మించనున్నట్లు కూడా స్టాలిన్ ప్రకటించారు. అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ అధ్యక్షుడు 'ఉరంగాపులి' (నిద్రించని పులి) బిరుదాంకితుడైన పీకే మూక్కయ్యదేవర్ 103 జయంతి వేడుకలు శుక్రవారం జరుగనున్నాయని, ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఆ దివంగత నాయకుడికి స్మారక మండపం నిర్మిస్తామని సభ్యుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. మూక్కయ్యదేవర్ 1952లో పెరియకుళం నియోజకవర్గంలో పోటీ చేసి గెలిచారని, ఆ తర్వాత 1957, 1962, 1967, 1971, 1977 శాసనసభ ఎన్నికల్లో ఉసిలంపట్టి నియోజకవర్గంలో పోటీ చేసి వరుసగా విజయం సాధించారని గుర్తు చేశారు. 1967లో రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వచ్చినప్పుడు మూక్కయ్యదేవర్ అండగా నిలిచారని చెప్పారు. అప్పట్లో ప్రోటెర్మ్ స్పీకర్‌గా ఆయన తొలిసారి ఎన్నికైన డీఎంకే శాసనసభ్యుల చేత ప్రమాణ స్వీకారం కూడా చేయించారని తెలిపారు. కచ్చాదీవిని శ్రీలంక ప్రభుత్వానికి ధారాదత్తం చేయడాన్ని వ్యతిరేకిస్తూ తొలిసారి పార్లమెంట్‌లో నిరసన ప్రకటించిన నాయకుడు మూక్కయ్యదేవర్ మాత్రమేనని స్టాలిన్ తెలిపారు. దేవర్ కులస్థులకు విద్యా సదుపాయాలందించాలని మూక్కయ్యదేవర్ కోరిక మేరకు కముది, ఉసిలంపట్టి, మేల్‌నీలిత్తనల్లూరు ప్రాంతాల్లో అప్పటి ముఖ్యమంత్రి అన్నాదురై ప్రభుత్వ కళాశాలలు నెలకొల్పినట్లు చెప్పారు. 'న్యాయానికి కట్టుబడే మహానాయకుడు మూక్కయ్యదేవర్' అని అన్నాదురై చేత ప్రశంసలందుకున్న ఆ మహనీయుడికి ఉసిలంపట్టిలో స్మారక మండపం ఏర్పాటు చేస్తామని స్టాలిన్ ప్రకటించారు.

పీఎంకే, సీపీఐ హర్షం...

రాజధాని నగరం చెన్నైలో కార్ల్‌మార్క్స్ విగ్రహాన్ని నెలకొల్పనున్నట్లు సీఎం స్టాలిన్ ప్రకటించడంతో పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి, సీపీఐ నేత ముత్తరసన్ హర్షం ప్రకటించారు. ఇదే విధంగా ఉసిలంపట్టిలో స్వాతంత్ర్య సమరయోధుడు మూక్కయ్యదేవర్‌కు స్మారక మండపం నిర్మించనుండటం కూడా హర్షణీయమన్నారు.

భద్రతా వలయంలో రామేశ్వరం

● ప్రధాని పర్యటన నేపథ్యంలో అడుగడుగునా నిఘా

అడయార్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాలోని రామేశ్వరం కేంద్ర బలగాల భద్రతా వలయంలోకి వెళ్ళిపోయింది. క్షేత్రస్థాయి ప్రాంతాలను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధీనంలోకి తీసుకుంది. ఈ నెల 6వ తేదీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రామేశ్వరం రానున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. రామేశ్వరం-మండపం ప్రాంతాలను కలుపుతూ సముద్రంలో నిర్మించిన పాంబన్ వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఆ తర్వాత రామేశ్వరంలోని రామనాథ స్వామివారిని దర్శించుకుంటారు. ఆ తరువాత బస్టాండు సమీపంలో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. సుమారు 3 గంటల పాటు ఆయన రామేశ్వరంలోనే గడపన్నారు. ఇందుకోసం . స్థానిక పోలీసులతో పాటు కేంద్ర సాయుధ బలగాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి భద్రతా విభాగం అధికారులు ముందుగా రామేశ్వరానికి చేరుకుని, ప్రధాని పాల్గొనే ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే, ప్రధాని ప్రయాణించే మార్గాల్లో చేపట్టాల్సిన అదనపు భద్రతపై పోలీస్ ఉన్నతాధికారులకు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో ఎస్పీ సతీష్, జిల్లా రెవెన్యూ అధికారి రాజ్ మనోహరన్, ప్రజాపనులశాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రధాని ప్రత్యేక భద్రతా విభాగం అధికారులు గురువారం అన్ని విభాగాల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మరోవైపు గురువారం నుంచే రామేశ్వరం ప్రాంతం ప్రధాని భద్రతా విభాగం అధికారుల కనుసన్నుల్లోకి వెళ్ళిపోయింది. రామేశ్వరంలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ బస్టాండు వద్ద నిర్మించిన వేదికను బాంబు స్క్వాడ్ తనిఖీ చేసింది. ప్రధాని వచ్చి వెళ్ళే రహదారి మార్గంలో సుమారు 20 కిలోమీటర్ల మేర రోడ్డుకిరువైపులా బారికేడ్లను అమర్చారు.

రామేశ్వరం మసీదు మినర్వాపై టార్పాలిన్ తొలగింపు



ప్రధాని పర్యటన సందర్భంగా పాంబన్‌లోని మసీదు మినర్వాను టార్పాలిన్‌తో కప్పివేయడం చర్చకు దారితీసిన నేపథ్యంలో, స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం దానిని తొలగించాలని ఆదేశించింది. కొత్త పాంబన్ వంతెన ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో, ఆ ప్రాంతంలోని మసీదు మినర్వాలను టార్పాలిన్‌తో కప్పివేశారని, ఇలాంటి చర్యలు మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని స్థానిక ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై తీవ్ర నిరసనలు వ్యక్తం కావడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో మినర్వాపై ఉంచిన టార్పాలిన్‌ను తొలగించారు.

అసెంబ్లీ నుంచి బీజేపీ వాకౌట్



వాకౌట్ చేస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు

ప్యారీస్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు-2024ను లోక్‌సభ ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ డీఎంకే తరఫున న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించడంపై బీజేపీ ఎమ్మెల్యేలు గురువారం అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ నయినార్ నాగేంద్రన్ సచివాలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా డీఎంకే, మిత్రపక్షాలు ఆందోళన చేయడం సరికాదని, ఈ బిల్లు ఒక మతానికి సంబంధించింది కాదని అయినా, ముఖ్యమంత్రి స్టాలిన్ శాసనసభలోనే వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రప్రభుత్వాన్ని తప్పుపట్టడం సరికాదన్నారు. పార్లమెంటులో ఇంతకు ముందే పరిచయం చేసిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు సంయుక్త కమిటీ పరిశీలన అనంతరం అందులో 14 అంశాలు కొత్తగా చేర్చిన తర్వాతే బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందారని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ న్యాయపరంగా ఆమోదించిన వక్ఫ్ బిల్లును డీఎంకే, ఆ కూటమిలోని పార్టీలు వ్యతిరేకించడం సరికాదన్నారు. అంతేకాకుండా, డీఎంకే కూటమి పార్టీల ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు నల్ల బాడ్జీలతో హాజరై సభలోనే నినాదాలు చేశారని, సహజంగా ప్రతిపక్షాల సభ్యులు తమ కోర్కెల కోసం నల్ల బాడ్జీలతో సభకు హాజరవుతారని అయితే, ముఖ్యమంత్రి స్వయంగా ప్రతిపక్షాల సభ్యులను రెచ్చగొట్టేలా వ్యవహరించడం ఖండించదగ్గదన్నారు. కేంద్రం ముస్లింలకు వ్యతిరేకంగా పనిచేస్తోందనే భ్రమను సృష్టించేలా సీఎం స్టాలిన్, రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నాటకమాడారని విమర్శించారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా న్యాయస్థానానికి వెళ్తామని అసెంబ్లీలో సీఎం స్టాలిన్ ప్రకటించడాన్ని ఖండిస్తూ బీజేపీ సభ్యులతో కలసి వాకౌట్ చేసినట్లు నయినార్ నాగేంద్రన్ తెలిపారు.

టాస్మాక్‌లో ఈడీ తనిఖీల వ్యవహారం

మరో బెంచ్‌కు మార్చాలని అభ్యర్థన

● తోసిపుచ్చిన సీజే

చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు జరిపిన తనిఖీలను సవాల్ చేస్తూ ఆ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను మరో ధర్మాసనానికి మార్చాలనే అభ్యర్థనను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ తోసిపుచ్చారు. టాస్మాక్ సంస్థలో మార్చి 6 నుండి 8 వరకు ఈడీ అధికారులు తనిఖీ చేసి రూ.1000 కోట్ల మేరకు అవినీతి జరిగిందంటూ ప్రకటించిన విషయం తెలిసిందే. టాస్మాక్‌లో ఈడీ తనిఖీలను సవాలు చేస్తూ ఆ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్లు వేశాయి. తొలుత ఆ పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయమూర్తులు ఎంఎస్ రమేష్, ఎన్.శెంథిల్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈడీ తదుపరి చర్యలను నిలుపుదల చేస్తూ స్టే విధించింది. ఆ తర్వాత ఆ న్యాయమూర్తులు విచారణ నుంచి తప్పుకున్నారు. దీంతో న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, కె.రాజశేఖర్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈడీ దాఖలు చేసిన కౌంటర్‌కు బదులివ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో సీనియర్ న్యాయవాది కె.విజయన్ గురువారం ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్, న్యాయమూర్తి మహమ్మద్ షఫీక్‌తో కూడిన ప్రథమ ధర్మాసనం ముందు హాజరై, టాస్మాక్, ఈడీకి సంబంధించి జరుగుతున్న కేసు విచారణను మరో ధర్మాసనానికి బదిలీ చేయాలని అభ్యర్థించారు. ఈ కేసును విచారణ జరుపుతున్న న్యాయమూర్తుల్లో కె.రాజశేఖర్ మంత్రి సెంథిల్‌బాలాజీ తరఫు న్యాయవాదికి సోదరుడని, అందువలన మరో ధర్మాసనానికి అప్పగించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతించాలని అభ్యర్థించారు. ఈ విన్నపాన్ని పరిశీలించిన ప్రథమ ధర్మాసనం దానిని తోసిపుచ్చింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న ధర్మాసనాన్ని సంప్రదించాలని సూచించింది.

వామపక్షాలతో బంధం ఈనాటిది కాదు

సీపీఎం మహాసభల్లో స్టాలిన్



సీపీఎం జాతీయ సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వామపక్షాలతో డీఎంకే బంధం ఈనాటిది కాదని, తమ పార్టీ పతాకంలోని సగం ఎరుపు రంగు కనుక పార్టీలో సగభాగం కమ్యూనిస్టులదేనని ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యాఖ్యానించారు. గురువారం సీపీఎం 24వ జాతీయ మహాసభల్లో భాగంగా మదురైలో నిర్వహించిన సదస్సులో పాల్గొని స్టాలిన్ ప్రసంగించారు. ఈ మహాసభలను ఇంత భారీ యెత్తున నిర్వహిస్తుండటంతో నిద్రపోని నగరంగా పేరుగడించిన మదురై నగరం ప్రస్తుతం అరుణవర్ణ నగరంగా మారిందని సీఎం చమత్కరించారు. ద్రవిడ ఉద్యమనేత పెరియార్ కమ్యూనిస్టు పార్టీ తొలి ప్రకటనను తమిళంలో అనువదించినప్పటి నుండి ద్రావిడ కళగం, డీఎంకేతో వామపక్షాలతో సంబంధాలు ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తరచూ తానొక కమ్యూనిస్టునని ప్రకటించుకునే వారని, మన పయనం మార్పు దిశగానే ఉండాలని, మార్పు అన్నది మంత్రమో తంత్రమో కాదని అది నిర్విరామంగా సాగే పద్ధతి అని చెప్పారు. 2019లో వామపక్షాలతో ఏర్పడిన పొత్తులో చీలికలు ఎప్పుడు వస్తాయా అని ప్రత్యర్థులు ఎదురుచూస్తున్నారని, వారి ఆశలు అడియాసలే అవుతాయని, ఈ బంధం తదుపరి ఎన్నికల్లోనూ మరింత పటిష్టమవుతుందన్నారు. మహానాడు మైదానానికి దివంగత వామపక్ష నేత సీతారామ్ ఏచూరి పేరుపెట్టడం హర్షణీయమన్నారు. రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి ఉండాలని అన్నాదురై కాలం నుండి ఇప్పటి దాకా చెబుతూనే ఉన్నామని, అయితే జీఎస్టీ ద్వారా రాష్ట్రాలకున్న పన్ను వసూళ్ల హక్కును హరించిన బీజేపీ పాలకులు ప్రస్తుతం రాష్ట్రాలకు అరకొరగా మిగిలి ఉన్న హక్కులను కూడా నాశనం చేయడానికే కంకణం కట్టుకున్నారని స్టాలిన్ ధ్వజమెత్తారు.

బీజేపీ నేతలుగా గవర్నర్లు...

ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లందరూ బీజేపీ ప్రాంతీయ నాయకుల్లా ప్రవర్తిస్తున్నారని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలకు అదేపనిగా ఆటంకాలు కలిగించడమే పనిగా పెట్టుకున్నారని స్టాలిన్ ఆరోపించారు. పునర్విభజన వల్ల తమిళనాడుతోపాటు కేరళ కూడా తీవ్రంగా నష్టపోనుందని చెబుతూ పునర్విభజనకు సంబంధించి ఉమ్మడి కార్యాచరణ కమిటీ చేసిన తీర్మానాలను వినతిపత్రంగా సమర్పించేందుకు ప్రధానితో భేటీకి ప్రయత్నిస్తుంటే అటువైపు నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. వక్ఫ్‌బిల్లును వ్యతిరేకిస్తూ డీఎంకే సుప్రీంకోర్టుకు వెళ్తుందని శాసనసభలో ప్రకటించిన మీదటే ఈ సదస్సుకు వచ్చానని ఆయన తెలిపారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు బాలకృష్ణన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్ణాటక ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్, తమిళనాడు మంత్రులు మూర్తి, పళనివేల్ త్యాగరాజన్, ఎంపీ వెంకటేశన్, సినీనటులు విజయ్ సేతుపతి, సముద్రఖని, ప్రకాష్ రాజ్, దర్శకులు వెట్రిమారన్, మారి సెల్వరాజ్, జ్ఞానవేల్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారియా కమిషన్ సిఫార్సులేమయ్యాయ్?

2012లో నరేంద్రమోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాలకు మరిన్ని హక్కులు కల్పించే సర్కారియా కమిషనర్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారని, మూడోసారి ప్రధాని పదవిలోకి వచ్చిన మోదీ ఆ సిఫారసులను అమలు చేయడానికి తీసుకున్న చర్యలేమిటో చెప్పగలరా అని ప్రశ్నించారు.

సమాచార దృష్టి

అన్నా వర్సిటీలో ప్రవేశాలకు 'ఆన్‌లైన్'లో దరఖాస్తులు

పెరంబూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో బీఈ, బీటెక్, బీ ప్లాన్ కోర్సుల్లో చేరేందుకు 'ఆన్‌లైన్' ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రకాష్ విడుదల చేసిన ప్రకటనలో... అన్నా వర్సిటీ ప్రాంగణంలోని గిండి ఇంజనీరింగ్ కళాశాలు, అళగప్ప కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, మద్రాసు కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, క్రోంపేట కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ తదితరాల్లో బీఈ, బీటెక్, బీ ప్లాన్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు https://cfa.annauniv.edu/cfa/ అనే వెబ్‌సైట్‌లో జూన్ 9వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలి. ఇతర రాష్ట్ర కేటగిరీలకు సంబంధించి బీఈ, బీటెక్, బి ప్లాన్‌లో చేరేందుకు ఈ నెల 11 నుంచి జూన్ 13వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ తెలిపారు.

రేపు ఆవిన్ బ్రాంచ్‌లో ఉచిత వైద్యశిబిరం

పెరంబూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆవిన్ ఆధ్వర్యంలో రామచంద్ర హాస్పిటల్, చెన్నై రోటరీ క్లబ్ సహకారంతో వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ స్క్రీనింగ్, డెంటల్ చెకప్ తదితరాలు నిర్వహించనున్నారు. విరుగంబాక్కంలోని ఆధునిక ఆవిన్ బ్రాంచ్‌లో శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనున్న ఈ శిబిరాన్ని ఆవిన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పూంగొడి ప్రారంభించనున్నారు. వివరాలకు 9944353459, 9444915453 అనే నెంబర్లు సంప్రదించవచ్చని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

టీఎన్‌పీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో గ్రూప్-4 పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో... టీఎన్‌పీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-1 , గ్రూప్-4 పోస్టుల భర్తీని రాతపరీక్ష ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈ నెల 9వ తేది నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 6381552624, 9626456509 అనే నెంబర్లు సంప్రదించి పేరు నమోదుచేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతాప్ తెలిపారు.

415 రైల్వేస్టేషన్లలో ఉచిత వైఫై సౌకర్యం

పెరంబూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 415 రైల్వేస్టేషన్లలో ఉచిత వైఫై సౌకర్యం కల్పించినట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ధర్మపురి డీఎంకే ఎంపీ ఎ.మణి రాసిన లేఖకు కేంద్ర మంత్రి సమాధానమిస్తూ ప్రయాణికులకు మెరుగైన వసతులు, రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా, తమిళనాడులోని 415 రైల్వేస్టేషన్లు సహా దేశవ్యాప్తంగా 6,115 స్టేషన్లలో ఉచిత వైఫై ఏర్పాటుచేశామన్ని తెలిపారు.

తాంబరం-రామేశ్వరం రైలు టైం టేబుల్

పెరంబూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం-రామేశ్వరం-తాంబరం మధ్య నడుపనున్న పాంబన్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల టైం టేబుల్‌ను దక్షిణ రైల్వే విడుదల చేసింది. రామనాథపురం జిల్లా పాంబన్‌లో రూ.550 కోట్ల వ్యయంతో నిర్మించిన రైలు వంతెనను ఈ నెల 6వ తేది ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో, తాంబరం-రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ రైళ్ల టేంటేబుల్ విడుదలైంది. ఆ ప్రకారం, తాంబరం నుంచి ప్రతిరోజు సాయంత్రం 6.05 గంటలకు బయల్దేరే పాంబన్ ఎక్స్‌ప్రెస్ (నెం.16103) విల్లుపురం, చిదంబరం, తిరువారూరు, పట్టుకోట, పరమకుడి మీదుగా మరుసటిరోజు ఉదయం 5.45 గంటలకు రామేశ్వరం చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.16104 రామేశ్వరం నుంచి మధ్యాహ్నం 3.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు వేకువజామున 3.10 గంటలకు తాంబరం చేరుకుంటుంది. కాగా, ఇప్పటికే చెన్నై-రామేశ్వరం మధ్య రెండు రైళ్లు నడుపుతున్న నేపథ్యంలో, ఇది మూడవది.

రేపటి నుంచి వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సెలవులను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం నగరం నుంచి పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) విడుదల చేసిన ప్రకటనలో... కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోవై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర జిల్లాలకు శుక్రవారం 245 బస్సులు, శనివారం 240 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 51 బస్సులు, మాధవరం బస్ టెర్మినల్ నుంచి శుక్ర, శనివారాల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ప్రయాణికులు రద్దీలో చిక్కుకోకుండా www.tnstc.in అనే వెబ్‌సైట్ ద్వారా రిజర్వేషన్ చేసుకుని ప్రయాణించవచ్చని ఎస్‌ఈటీసీ తెలిపింది.

ఈ-సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వ బస్సు టిక్కెట్ల రిజర్వేషన్

పెరంబూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఈ-సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సు టిక్కెట్లు రిజర్వేషన్ సదుపాయం కల్పించనున్నారు. ప్రస్తుతం ప్రధాన నగరాలు, జిల్లా కేంద్రాల్లో మాత్రమే ప్రభుత్వ బస్సులకు ముందస్తు రిజర్వేషన్ ఉంది.. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రిజర్వేషన్ చేసుకొనేందుకు సరైన వసతులు లేవనే ఫిర్యాదులున్నాయి. దీనిపై స్పందించిన రవాణా శాఖ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 530 ప్రభుత్వ ఈ-సేవా కేంద్రాల్లో ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సులకు రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించింది. ఈ విషయమై అధికారిక ప్రకటన త్వరలో విడుదల కానుందని అధికారులు తెలిపారు.

మే 15 లోగా అన్ని చోట్లా తమిళంలో బోర్డులు

పెరంబూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లాలోని దుకాణాలు, వాణిజ్య కాంప్లెక్స్‌లు, హోటళ్లు, కర్మాగారాలు, పాఠశాలలు, కళాశాలల బోర్డులో పేర్లు తమిళంలో ఉండేలా ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్ కె.దర్పకరాజ్ ఆదేశించారు. బోర్డుల్లో తమిళ అక్షరాలు పొందుపరిచేందుకు మే 15వ తేది వరకు అవకాశం కల్పించినట్లు, అనంతరం బోర్డులు ఇతర భాషల పేర్లతో ఉంటే జరిమానా విధిస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

పంచవటి ఆలయంలో 6న శ్రీరామనవమి వేడుకలు

టి.నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దిండివనం - పుదుచ్చేరి రహదారిలో 'మధ్య తిరుపతి'గా పిలిచే పంచవటి ఆంజనేయస్వామివారి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 6న సీతారామ కల్యాణంతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. ఇందులో భాగంగా ప్రతిరోజూ విశేషహోమాలు, ఏడు కాలాల పూజలు జరిపిస్తున్నారు. ఆలయంలోని శ్రీరామచంద్రమూర్తి సన్నిధిలో గురువారం ఉదయం విశేష లక్షార్చన, పూర్వాంగ పూజలు ప్రారంభమయ్యాయి. రామనవమి సందర్భంగా ఈ నెల 6వతేదీ ఉదయం సీతాసమేత శ్రీరామచంద్రమూర్తి, 36 అడుగుల ఎత్తైన విశ్వరూప జయమంగళ పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహానికి పాలు, పన్నీరు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో తిరుమంజనం నిర్వహించనున్నారు. ఏడు కాల పూజలు తర్వాత తిరుమంజనం, పుష్పాభిషేకం జరుగుతాయి. ఉదయం 9 గంటలకు ప్రత్యేక నాదస్వర కచేరి, ప్రముఖ విల్లుపాట్టు కళాకారుడు దివంగత సుబ్బు ఆరుముగం తనయురాలు భారతి తిరుమగన్ బృందం సభ్యులు రామాయణగాథ గానం చేయనున్నారు. 4.30 గంటలకు సీతారామ కల్యాణోత్సవం జరుగుతుంది. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఎం.కోదండరామన్, సభ్యులు ఆర్.యువరాజన్, నరసింహన్ తదితరులు భక్తులకు తగు సదుపాయాలు కల్పిస్తున్నారు.



పంచవటి ఆలయంలోని పంచముఖాంజనేయస్వామి

ఊటీ, కొడైకెనాల్‌లో ఈ-పాస్ విధానం

హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్

ప్యారీస్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన వేసవి విడిది కేంద్రాలైన ఊటీ, కొడైకెనాల్ ప్రాంతాల్లో అమలు పరచిన ఈ-పాస్ ఉత్తర్వులు పరిశీలించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం మద్రాసు హైకోర్టులో గురువారం పిటిషన్ వేసింది. దిండుగల్ జిల్లాలోని కొడైకెనాల్, నీలగిరి జిల్లాలోని ఊటీ పర్యాటక ప్రాంతాలకు ఎంతమంది పర్యాటకులు, వారి వాహనాలను అనుమతించొచ్చు అనే విషయమై మద్రాసు ఐఐటీ, బెంగళూరు ఐఏఎం సంస్థలు సర్వేలుచేశారు. ఈ నేపథ్యంలో, వేసవి సెలవుల సందర్భంగా ఈ రెండు ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లే వాహనాలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలంటూ మద్రాసు హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. ఆ మేరకు కొడైకెనాల్‌కు సాధరణ రోజుల్లో 4,000, వారాంతపు రోజుల్లో 6,000 వాహనాలు, ఊటీకి సాధారణ రోజుల్లో 6,000, వారాంతపు రోజుల్లో 8,000 వాహనాలు మాత్రమే అనుమతించాలని, అందుకు పర్యాటకులు తమ వాహనాలకు ముందుగా ఈ-పాస్ తీసుకోవాలని నిబంధనలు విధించారు. ఈ నేపథ్యంలో, ఈ-పాస్ విధానం వ్యతిరేకిస్తూ ఊటీలో బుధవారం వ్యాపారులు దుకాణాలు మూసి బంద్ నిర్వహించారు. ఇదిలా ఉండగా, వాహనాలను నియంత్రిస్తూ జారీచేసిన ఉత్తర్వులు మరోమారు పరిశీలించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున మద్రాసు హైకోర్టులో దాఖలైన పిటిషన్, శుక్రవారం విచారణకు రానుందని హైకోర్టు వర్గాలు తెలిపాయి.

అగ్నిగుండ ఉత్సవంలో అపశ్రుతి

చిన్నారిని ఎత్తుకుని తడబడిన భక్తుడు ● రక్షించిన సిబ్బంది



పెరంబూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల చిన్నారిని ఎత్తుకుని అగ్నిగుండ ప్రవేశం చేసిన భక్తుడు, హఠాత్తుగా అగ్నిగుండంలో పడిపోతుండగా, చుట్టుపక్కల ఉన్న వారు రక్షించారు. నామక్కల్ జిల్లా పల్లిపాళయం ఆవరంగాడు ప్రాంతంలోని అగ్ని మారియమ్మన్ ఆలయ వేడుకల్లో భాగంగా బుధవారం అగ్నిగుండ ఉత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో నామక్కల్, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు, పురుషులు పాల్గొని అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆవరంగాడుకు చెందిన భక్తుడు కుమార్, తన కుమార్తెను ఎత్తుకుని అగ్నిగుండ ప్రవేశం చేశాడు. గుండంలో దిగిన కొద్దిసేపట్లోనే తబడిన కుమార్, అగ్నిగుండంలో తూలిపోయి పడిపోతూ తమాయించుకుని అగ్నిగుండం గట్టుకు చేరడంతో, చుట్టుపక్కల ఉన్న వారు చిన్నారితో సహా అతడిని సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

సంతానం కోసం యువతుల వినూత్న మొక్కులు



మోకాళ్లపై వంగి నేలపై భోజనం చేస్తున్న భక్తులు

పెరంబూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సంతానం కోసం యువతులు వినూత్న మొక్కులు చేపట్టారు. అరియలూరు జిల్లా సెందురై సమీపంలోని సిరుకడంబూర్ గ్రామంలోని మురుగన్ ఆలయ పంగుణి ఉత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. ఈ ఆలయ వేడుకల్లో సంతానం, వివాహం కోసం వేడుకుంటే ఆ కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఆ ప్రకారం, బుధవారం మధ్యాహ్నం పుణ్యస్నానాలు ఆచరించిన యువతులు, మండుటెండలో చేతులు వీపు వెనుకకు ఉంచుకొని, మోకాళ్లపై నేలపైన కూర్చొని నేలపై వడ్డించిన భోజనాన్ని వంగి తిన్నారు. స్వామివారికి ఇలాంటి మొక్కులు చెల్లించడం ద్వారా వివాహం, సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకమని ఆలయ పూజారులు తెలిపారు.

ఏర్కాడు ఘాట్‌రోడ్డులో కూలిన చెట్టు

● వాహనాల రాకపోకలకు అంతరాయం

టి.నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో పేదల ఊటీగా పేరుగాంచిన ప్రముఖ పర్యాటక ప్రాంతం ఏర్కాడు ఘాట్ రోడ్డులో గురువారం ఉదయం ఓ పెద్ద చెట్టు కూలిపడింది. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఊటీ, కొడైకెనాల్‌లో ఈపాస్‌ల విధానాన్ని అమలు చేయడంతో ఆ రెండు ప్రాంతాలకు వెళ్ళాలనుకున్న పర్యాటకులు ప్రస్తుతం ఏర్కాడుకు వస్తున్నారు. దీంతో ఏర్కాడులో పర్యాటకుల సందడి అధికమైంది. ఈ నేపథ్యంలో గురువారం వేకువజామున ఘాట్‌రోడ్డు ఎనిమిదో మలుపు వద్ద రహదారికి అడ్డంగా ఓ చెట్టు కూలిపడింది. ఈ సమాచారం తెలుసుకుని ఏర్కాడు పోలీసులు, హైవే అధికారులు ఆ చెట్టును తొలగించారు. దీని కారణంగా ఆ మార్గంలో గంటకు పైగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. చెట్టు తొలగింపు పనులు పూర్తయ్యాక ఆ ఘాట్‌రోడ్డులో వాహనాల రాకపోకలను అనుమతించారు.



కూలిన చెట్టును తొలగిస్తున్న అటవీశాఖ సిబ్బంది

ప్రమాదంలో గాయపడ్డ కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థికసాయం



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గత నెల 7వ తేదీన తిరుత్తణి సమీపంలోని కేజీ.కండ్రిగై ప్రాంతంలో జరిగిన బస్సు ప్రమాదంలో గయపడిన క్షతగాత్రులను ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ పరామర్శించారు. ఈ నేపథ్యంలో, చెన్నై రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న 30 మంది క్షతగాత్రులను కలుసుకుని, గాయపడిన వారందరికి మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి సిబ్బందిని కోరారు. ప్రమాదంలో మృతిచెందిన ఐదుగురు నేతకార్మికుల కుటుంబాలకు ఆయన ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపేట డీఎంకే కార్యదర్శి షణ్ముగం, జిల్లా ప్రతినిధి సెంగుట్టువన్, పంచాయతీ మాజీ అధ్యక్షుడు మోనిషా శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

చెదల నివారణపై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

వేలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు హోటళ్ల సంఘం ఆధ్వర్యంలో వేలూరులోని డార్లింగ్ హోటల్ చెదపురుగుల నివారణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. హోటళ్ల సంఘం అధ్యక్షుడు డార్లింగ్ వెంకటసుబ్బు ప్రారంభించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పశుపతి, ప్రవీణ్, కల్పన సహా పలువురు హోటళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

కాట్పాడిలో కలెక్టర్ ఇంటింటి సర్వే



ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేలూరులో అనధికారిక స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్న పేద కుటుంబాలకు చెందిన వారికి ఉచిత ఇళ్లపట్టాలు పంపిణీ చేయాలన్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మీ ఫీల్డ్ సర్వే చేశారు. కాట్పాడి ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో సర్వే నిర్వహించిన కలెక్టర్ అర్హుల పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సెంథిల్‌కుమారన్, అభివృద్ధిశాఖ ఇంజనీర్లు, శ్రీనివాసన్, ఆనందకుమార్, కనకరాజ్ సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

8 మంది బంగ్లాదేశీయుల అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చట్టవిరుద్ధంగా ఉంటున్న 8 మంది బంగ్లాదేశీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. కడలూరు జిల్లా చిదంబరంలో బంగ్లాదేశ్‌కు చెందిన పలువురు బస చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దాని ఆధారంగా పోలీసులు, ఆ ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్న 8 మంది బంగ్లాదేశీయులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నకిలీ ఆధార్ కార్డును స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు.

అభివృద్ధి పనుల విషయంలో రాజీపడొద్దు

● కలెక్టర్ సుబ్బుక్ష్మి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియత్తం యూనియన్‌లో నిర్మించబోతున్న రోడ్లు, డ్రైనేజీ పనులపై గురువారం ఉదయం అధికారులతో కలెక్టర్ సుబ్బులక్ష్మి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరుగకుండా జిల్లా యంత్రాంగం పర్యవేక్షించాలని, నాణ్యత విషయంలో రాజీపడొద్దని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సెంథిల్‌కుమారన్, అభివృద్ధిశాఖ ఇంజనీర్లు, శ్రీనివాసన్, ఆనందకుమార్, కనకరాజ్ సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేలూరులో డాగ్‌స్క్వాడ్ శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు

వేలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేలూరులో క్రైమ్ వ్యవహారాల్లో, పోలీసులకు కేసుల విచారణలో సహాయపడే డాగ్ స్క్వాడ్ శిక్షణా కేంద్రంలో గురువారం ఉదయం పోలీసు ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో నూతన శునకాలకు శిక్షణా తరగతులను ప్రారంభించారు. వేలూరు జిల్లా ఎస్పీ ఎన్.మదివానన్ నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణా తరగతుల్లో భాగంగా శునకాలకు 9 నెలల పాటు మత్తు పదార్థాలు, క్రైమ్ వ్యవహారాలను వాసన పసిగట్టే విధంగా శిక్షణలు ఇవ్వనున్నారు.

వక్ఫ్ బోర్డులో మార్పులపై నిరసన



వినాదాలు చేస్తున్న ఎస్‌డీపీఐ నేతలు

వేలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు చట్టంలో మార్పులు తీసుకొస్తూ పార్లమెంటులో ప్రవేశపెట్టిన నూతన వక్ఫ్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వేలూరు ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో నిరసనా కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు బషీర్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నూతన వక్ఫ్ బోర్డును ఉపసంహరించుకోవాలని లేకుంటే నిరసనలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ అధ్యక్షుడు మహ్మద్ జావీద్, ఎస్‌డీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు సయ్యద్ అహ్మద్, మహిళా విభాగం నాయకురాలు సయ్యద్ అలీ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

చదురగిరి ఆలయానికిప్రతిరోజు అనుమతి

పెరంబూర్,ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి):చదురగిరికొండ ఆలయానికి ప్రతిరోజు భక్తులను అనుమతించనున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పు సమీపంలోని పశ్చిమ కనుమల్లో చదురగిరి సుందర, చందన మహాలింగం ఆలయం ఉంది. ఈ ఆలయానికి ప్రతిరోజు భక్తులను అనుమతిస్తుండగా, 2015లో సంభవించిన వరదల కారణంగా పలువురు మృత్యువాతపడ్డారు. అనంతరం ప్రతినెలా ప్రదోషం, అమావాస్య, పౌర్ణమి తదితర విశేష రోజుల్లో మాత్రమే భక్తులు ఆలయానికి వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. చదురగిరి ఆలయానికి ప్రతిరోజు భక్తులను అనుమతించనున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది.ఆప్రకారం, ఉదయం 6నుంచి 10గంటల వరకు చెక్‌పోస్ట్ మార్గంగా భక్తులను అనుమతించనున్నారు.ఆలయానికి వెళ్లిన భక్తులు సాయంత్రం 4 గంటలకు తిరిగి రావాలని, రాత్రి వేళ తగిన అనుమతులు లేకుండా కొండపై బసచేసే భక్తులపై చర్యలు చేపడతామని అధికారులు హెచ్చరించారు.

మాకు కార్లు ఇవ్వరూ...!

● అసెంబ్లీ సమావేశంలో పీఎంకే ఎమ్మెల్యే సదాశివం

పెరంబూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల్లో చాలా మంది పేదరికంతో ఉన్నారని, వారికి కారు కేటాయించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని పీఎంకే ఎమ్మెల్యే సదాశివం విజ్ఞప్తి చేశారు. శాసనసభ సమావేశాల్లో గురువారం ఎమ్మెల్యే సదాశివం మాట్లాడుతూ.. 500 ఓట్లతో గెలిచిన మున్సిపాలిటీ కౌన్సిలర్లకు కూడా కార్లు ఇస్తున్నారని, సుమారు 65 కి.మీ విస్తీర్ణం కలిగిన తమ నియోజకవర్గాల్లో పర్యటించేందుకు ఎమ్మెల్యేలకు కార్లు లేవన్నారు. ఎమ్మెల్యేల్లో చాలా మంది పేదరికంతో ఉన్నారని, అందువల్ల ప్రభుత్వమే వారికి కార్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మంత్రి దురైమురుగన్ స్పందిస్తూ... ఈ విషయాన్ని ఆర్థిక శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించగా, ఆర్థిక మంత్రి అర్థమనస్కులని, ముఖ్యమంత్రి పూర్తి మనసున్నవారని, ఆయన ఈ విషయం పరిశీలించాలని ఎమ్మెల్యే సదాశివం సూచించారు.

విరుగంబాక్కం శ్మశానవాటిక మూసివేత

పెరంబూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడంబాక్కం మండలం వార్డు 128లో ఉన్న విరుంగబాక్కం శ్మశానవాటికలో మరమ్మతుల కారణంగా ఈ నెల 5 నుంచి 25వ తేది వరకు మూసివేయనున్నారు. ఈ సమయంలో ప్రజలు సమీపంలోని ఏవీఎం శ్మశానవాటికను వినియోగించుకోవాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

హాస్టల్ విద్యార్థులకు లైంగిక వేధింపులు

● ఫాదర్ సహా ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యవహారంలో ఫాదర్ సహా ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. సమయపురంలోని సెయింట్ జేవియర్ బ్రిట్టో హాస్టల్‌లో పలువురు విద్యార్థులు ఉంటున్నారు. ఈ విద్యార్థులకు ఫాదర్ కుళందైనాథన్, సుందరరాజన్ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై బాధిత విద్యార్థుల ఫిర్యాదుతో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కుళందైనాథన్, సుందరరాజన్‌లను అరెస్ట్ చేశారు.

పదోతరగతి పరీక్షల్లో గోల్‌మాల్

● తల్లికి బదులు పరీక్షరాసిన కుమార్తె అరెస్టు

టి.నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం సమీపం వెళ్ళిపాళయంలోని ఓ పాఠశాలలో బుధవారం ఉదయం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా తల్లికి బదులుగా ఆంగ్ల పరీక్ష రాసిన కుమార్తెను పోలీసులు అరెస్టు చేశారు. వెళ్ళిపాళయం పాఠశాల పరీక్షా కేంద్రాన్ని బుధవారం ఉదయం తనిఖీ అధికారి పరిశీలించారు. వారిలో ఓ విద్యార్థిని ముసుగు ధరించి పరీక్ష రాయడం గమనించారు. వెంటనే ఆ విద్యార్థిని వద్దకు వెళ్ళి ముసుగు తొలగించమని చెప్పటంతో ఆమె ముసుగు తొలగించింది. అదే సమయంలో తనిఖీ అధికారి ఆమె హాల్‌టికెట్ పరిశీలించగా, అందులో ఓ మహిళ ఫొటో ఉండటం గమనించారు. దీనితో ఆ విద్యార్థినిని మరో గదికి తీసుకెళ్ళి విచారణ జరిపారు. ఆ విచారణలో ఆమె నాగపట్టినంకు చెందిన సెల్వాంబికై (25) అని ఆమె తల్లి సుగంధికి బదులుగా ఆంగ్ల పరీక్షను రాసేందుకు వచ్చినట్లు గుర్తించారు.. అంతే కాకుండా ముందు రోజు జరిగిన పరీక్షకు సెల్వాంబికై ముఖానికి ముసుగు ధరించి ఆ పరీక్ష రాసినట్లు తెలుసుకున్నారు. ఈ విషయాన్ని తనిఖీ అధికారి జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారుల విచారణ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సెల్వాంబికైని అరెస్టు చేశారు.

బాలికను వివాహం చేసుకున్న నేపాలీ యువకుడి అరెస్టు

టి.నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ నూలుమిల్లులో పనిచేస్తున్న అసోమ్ రాష్ట్రానికి చెందిన దంపతుల 15 యేళ్ల కుమార్తెను కిడ్నాప్ చేసి వివాహం చేసుకున్న నేపాలీ యువకుడు ఉపేందర్ (22)ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ బాలికను ప్రేమపేరుతో మాయమాటలు చెప్పి మోసగించి పెళ్ళి చేసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి హిమాచల్ ప్రదేశ్‌లో దాగిన ఉపేందర్‌ను, బాలికను ఈరోడ్‌కు తీసుకొచ్చారు. ఆ తర్వాత ఉపేందర్‌పై బాల్యవివాహ నిరోధక చట్టం కిందకేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

లైంగిక వేధింపుల కేసులో వృద్ధుడికి యావజ్జీవశిక్ష

ప్యారీస్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల క్రితం ఐదేళ్ల చిన్నారిపై లైంగిక వేధింపులకు గురిచేసిన కామాంధుడుకి న్యాయస్థానం యావజ్జీవశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. పోలీసుల కథనం మేరకు... పల్లికరనై ప్రాంతంలో నివసిస్తున్న రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి వేణుగోపాల్ (63) ఇంటికి ఓ చిన్నారి తరచూ వెళ్లి ఆడుకునేదిది. ఈ నేపథ్యంలో, 2021 మే 10వ తేది ఆ చిన్నారి ఇంటికొచ్చిన సమయంలో వేణుగోపాల్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఏడుస్తూ ఇంటికెళ్లిన చిన్నారి తల్లిదండ్రులకు తెలిపింది. వారు పల్లికరనై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారించిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి వేణుగోపాల్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ పూర్తికావడంతో నిందితుడు వేణుగోపాల్‌కు చెంగల్పట్టు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి నసీమాభాను యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే, బాధిత చిన్నారికి పరిహారంగా రూ.3 లక్షలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

ఆన్‌లైన్ రమ్మీలో రూ.50 లక్షలు నష్టం

● యువకుడి ఆత్మహత్య



కార్తిక్ (ఫైల్‌ఫొటో)

వేలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీ గేమ్‌లో నగదు కోల్పోయిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వేలూరు జిల్లా కేవీ.కుప్పం ప్రాంతానికి చెందిన కార్తిక్ (37) అదే ప్రాంతంలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. కొద్ది నెలలుగా ఆన్‌లైన్ రమ్మీకి అలవాటు పడిన కార్తిక్, సుమారు రూ.50 లక్షలు బెట్టింగ్‌లో పెట్టి ఓడిపోయినట్లు తెలిసింది. అలాగే, మరో రూ.2 లక్షలు కావాలని తల్లిదండ్రులను ఒత్తిడి చేశాడు. ఈ క్రమంలో తెలిసిన వారిదగ్గర, బంధువుల వద్ద పెద్దమొత్తంలో అప్పులు చేసి, అవి తీర్చలేని పరిస్థితుల్లో గురువారం ఉదయం తన ఇంట్లో ఎవరిలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, కార్తిక్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, దీనిపై విచారణ చేపట్టనున్నారు.

సరస్సులో వ్యర్థాలను తొలగించండి



వ్యర్థాలు

తిరుత్తణి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా అమ్మవారికుప్పం ప్రాంతంలోని సరస్సు వ్యర్థాలతో నిండిపోయింది. గత రెండేళ్లుగా రాత్రి వేళలో గుర్తుతెలియని వ్యక్తులు భవనాల వ్యర్థాలను తీసుకొచ్చి సరస్సులో పడేస్తున్నారు. దీంతో సరస్సు వ్యర్థాలతో నిండి దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. . వ్యర్థాలను పడేస్తున్న వారిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



దెబ్బతిన్న రోడ్డు

అన్నకు సాయం చేయలేను.. అప్పు తీర్చలేను

● మద్రాస్ హైకోర్టులో ప్రభు పిటిషన్



ప్రభు, రాంకుమార్

తమిళ చిత్రజ్యోతి

తన సోదరుడు రాంకుమార్ తీసుకున్న రుణాన్ని తాను తీర్చలేనని మద్రాస్ హైకోర్టుకు నటుడు ప్రభు తెలిపారు. పైగా అన్నై ఇల్లంలో తన అన్నకు ఎలాంటి హక్కులేదని స్పష్టం చేశారు. దివంగత నటుడు శివాజీ గణేశన్ మనవడు, నటుడు రాంకుమార్ కుమారుడు దుష్యంత్ సినిమా నిర్మాణం కోసం ధనభాగ్యం ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థ నుంచి రూ.3.75 కోట్ల రుణాన్ని తీసుకుని రుణాన్ని తిరిగి చెల్లించలేదు. దీంతో ఆ సంస్థ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. నటుడు రాంకుమార్ ఉంటున్న అన్నై ఇల్లంను జప్తు చేయాలని ఆదేశించింది.ఈ ఉత్తర్వులు కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారాయి.ఈ క్రమంలో అన్నై ఇల్లంకు తమ కుటుంబ సభ్యులకు ఎలాంటి సంబంధం లేదని, ఆ ఇల్లు తన తమ్ముడు ప్రభుకు చెందినదని రాంకుమార్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇదిలావుంటే, అన్నై ఇల్లంను జప్తు చేయాలంటూ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని నటుడు ప్రభు హైకోర్టులో పిటిషన్ వేయగా, దానిపై గురువారం విచారణ జరిగింది. ఆ సమయంలో న్యాయమూర్తి అబ్దుల ఖుద్దూస్ కీలక వ్యాఖ్యలు చేశారు.'అన్న తీసుకున్న రూ.3కోట్ల రుణాన్ని చెల్లించి,ఆ తర్వాత ఆ డబ్బును మీ అన్న వద్ద తీసుకోవచ్చు కదా'అంటూ వ్యాఖ్యలు చేయగా, 'రాంకుమార్ అనేక మంది వద్ద రుణాలు తీసుకునివున్నారు. ఆయన చేసిన అప్పులు నేను తిరిగి చెల్లించలేని స్థితిలో ఉన్నాను. నా జీవితంలో ఇప్పటివరకు ఒకరి వద్ద ఒక్క రూపాయి కూడా అప్పు తీసుకోలేదు. అన్నై ఇల్లంలో నా అన్న రాంకుమార్‌కు ఎలాంటి హక్కు లేదు. అది పూర్తిగా నాకే సొంతం' అని నటుడు ప్రభు తరపున కౌంటర్ దాఖలు చేశారు. ఈ వాదోపవాదాలు తర్వాత తదుపరి విచారణను ఈ నెల 8వ తేదీకి న్యాయమూర్తి వాయిదావేశారు.

వివాహితులతో డేటింగ్ చేయను

● దివ్యభారతి



పెళ్ళయిన పురుషులతో తాను డేటింగ్ చేయనని యువ హీరోయిన్ దివ్యభారతి స్పష్టం చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ - సినీ నేపథ్యగాయని సైంధవి దంపతులు విడిపోవడానికి దివ్యభారతి కారణమంటూ కోలీవుడ్‌లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. దీనిపై ఆమె తాజాగా స్పందించారు. జీవీ ప్రకాష్ - దివ్యభారతి కలిసి తొలిసారి 'బ్యాచిలర్' అనే చిత్రంలో నటించారు. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య ప్రేమ, డేటింగ్ జరుగుతోందంటూ వచ్చిన వార్తలపై స్పందించి వివరణ ఇచ్చినప్పటికీ వీరిద్దరి మధ్య రహస్య బంధం కొనసాగుతుందనే రూమర్స్ వినిపిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో దివ్యభారతి తాజాగా ట్వీట్ రూపంలో స్పందించారు. 'జీవీ ప్రకాష్ కుటుంబ సభ్యులతో నాకెలాంటి సంబంధం లేదు. నేను ఎవరితోనూ డేటింగ్‌లో లేను. ముఖ్యంగా వివాహితులతో డేటింగ్ చేయను. ఆధారాలు లేకుండా నిందలు వేయడం భావ్యంకాదు. నిజానికి ఈ విషయంపై స్పందించాలని అనుకోలేదు. కానీ, కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నా సహనాన్ని పరీక్షిస్తున్నాయి. ఈ పుకార్ల వల్ల నాకు చెడ్డ పేరు వస్తుంది. అందుకే స్పందించాల్సి వస్తుందని, తప్పుడు వార్తలు సృష్టించడం మానుకుని సమాజానికి మంచి చేసే పనులపై దృష్టిసారించండి' అంటూ దివ్యభారతి సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

రెడిన్ కింగ్‌స్లీ - సంగీతలకు పండంటి ఆడబిడ్డ



తమిళ చిత్రపరిశ్రమలో ప్రముఖ హాస్య నటుడైన రెడిన్ కింగ్‌స్లీ - సంగీత దంపతులకు పండంటి ఆడబిడ్డ జన్మించింది. ఈ విషయాన్ని రెడిన్ గురువారం వెల్లడించారు. 2023లో బుల్లితెర నటి సంగీతను రెడిన్ కింగ్‌స్లీ ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇటీవల తన భార్యకు సీమంతాన్ని ఆయన ఘనంగా నిర్వహించి, ఆ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇపుడు ఈ దంపతులకు ఆడబిడ్డ పుట్టింది. తన కుమార్తెను ఎత్తుకుని వున్న ఫొటోను రెడిన్ కింగ్‌స్లీ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అభిమానులు ఆ దంపతులకు శుభాకాంక్షలు చెబుతున్నారు. కాగా, నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో వచ్చిన 'కోలమావు కోకిల' అనే చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైన రెడిన్ కింగ్‌స్లీ.. ప్రస్తుతం తమిళ చిత్రపరిశ్రమలో బిజీగా మారారు. శివ కార్తికేయన్ నటించిన 'డాక్టర్' చిత్రంలో కింగ్‌స్లీ కామెడీ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. అలాగే, విజయ్ 'బీస్ట్', రజనీకాంత్ 'జైలర్' చిత్రాల్లో నటించారు.

'రెట్రో' మూవీకి డబ్బింగ్ పూర్తి చేసిన సూర్య

కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రెట్రో'. ఇందులో తన పాత్రకు సంబంధించి డబ్బింగ్‌ను హీరో పూర్తి చేశారు. తమిళం, తెలుగు తదితర భాషల్లో రూపొందిన ఈ మూవీలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించారు. ఇతర పాత్రల్లో జయరామ్, కరుణాకరన్, జోజు జార్జ్ తదితరులు పోషించారు. చిత్రీకరణ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను శరవేగంగా జరుపుకుంటుంది. ఇప్పటికే వ్యాపారం ప్రారంభంకాగా, డిజిటల్, శాటిలైట్, థియేటర్ వ్యాపార కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో సూర్య తన పాత్రకు సంబంధించి డబ్బింగ్ పూర్తి చేశారు. కాగా, సూర్య నటించిన 'కంగువా' సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తాపడిన విషయం తెల్సిందే. దీంతో 'రెట్రో'పై భారీ అంచనాలు నెలకొన్నాయి.



'రెట్రో'లో సూర్య

మొగప్పేర్‌లో రోటరీ డిస్ట్రిక్ట్ 3233 తొలి బ్లడ్ బ్యాంక్

ఐసిఎఫ్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మొగప్పేర్‌లోని మద్రాస్ మెడికల్ మిషన్‌లో, రోటరీ డిస్ట్రిక్ట్ 3233కి చెందిన మొట్టమొదటి బ్లడ్ బ్యాంక్ ఏర్పాటైంది. శివ ప్యారీబాయి బ్రిజ్‌లాల్ దూత్ చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఏర్పాటు చేసిన ఈ బ్లడ్ బ్యాంక్‌ను రోటరీ మాజీ గవర్నర్ ఇసాక్ నాజర్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శివప్యారీబాయి బ్రిజ్‌లాల్ దూత్ చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వీణా జావర్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 3233 డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్.మహావీర్ బోత్రా, మద్రాస్ మెడికల్ మిషన్ ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ జాకబ్ రాయ్, ఎంఎంఎం డైరెక్టర్ డాక్టర్ క్రిస్టోఫర్ రాయ్, బ్లడ్ బ్యాంక్ విభాగాధిపతి డాక్టర్ సెంథిల్ కుమారన్, రిటైర్డ్ పీడీజీ డాక్టర్ నందకుమార్, పీడీజీ బాబు పేరం, దేవేంద్రన్, సురేష్ గణపతి, పీపీ వేణుగోపాల్, పీపీ అంబలవనన్ తదితరులు పాల్గొన్నారు.



బ్లడ్ బ్యాంక్ ప్రారంభోత్సవ దృశ్యం

వీఐటీ వర్సిటీలో రక్తదాన శిబిరం



వేలూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేలూరు వీఐటీ యూనివర్శిటీలో గురువారం ఉదయం రక్తదాన శిబిరాన్ని ఆ కళాశాల ఛాన్స్‌లర్ విశ్వనాథన్ ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో వెయ్యి మంది విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, ప్రజా సంక్షేమ శాఖ డైరెక్టర్ నాయుడు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

→ రక్తదాన శిబిరంలో యూనివర్శిటీ నిర్వాహకులు

కావేరి హాస్పిటల్‌లో 4 నెలల పసికందుకు కాలేయ మార్పిడి

చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని కావేరి హాస్పిటల్‌లో నాలుగు నెలల పసికందుకు అతి క్లిష్టమైన కాలేయ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి పీడియాట్రిక్ కన్సల్టెంట్ డాక్టర్ డి.శివరామన్ తెలిపారు.గురువారం ఉదయం ఆస్పత్రిలో ఏర్పాటైన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ పసికందు తల్లి కాలేయంలో కొంత భాగం స్వీకరించి ఈ శస్త్రచికిత్సను 8 గంటల పాటు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ పసికందు సంపూర్ణంగా కోలుకుందని చెప్పారు. ముఖ్యమంత్రి జీవిత బీమా పథకం కింద ఆ పసికందుకు కాలేయ మార్పిడి శస్త్రచికిత్స జరిగిందన్నారు. మీడియా సమావేశంలో డాక్టర్ గౌతమ్ కృష్ణ జయకుమార్, డాక్టర్ విఘ్నేశ్వరన్, డాక్టర్ స్వామినాథన్ సంబంధం, డాక్టర్ సత్యనారాయణన్, మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ పూర్ణచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



పసికందుకు చికిత్స చేసిన వైద్యనిపుణులు డాక్టర్ శివరామన్, డాక్టర్ విఘ్నేశ్వరన్, డాక్టర్ స్వామినాథన్ సంబంధం తదితరులు

కంచి ఆస్పత్రికి వైద్య పరికరాల వితరణ



ఒప్పంద పత్రాలను చూపుతున్న దృశ్యం

అడయార్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుగంబాక్కంలోని కంచి కామకోటి చైల్డ్ ట్రస్ట్ హాస్పిటల్‌కు ది ఆర్‌ఈసీ ఫౌండేషన్ వైద్య పరికరాలను వితరణగా అందజేసింది. సీఎస్‌ఆర్‌లో భాగంగా రూ.1.83 కోట్ల విలువైన వైద్య పరికరాలను ఉచితంగా అందజేయనున్నారు. మొదట కొన్ని పరికరాలను అందజేశారు. ఇందుకోసం ఒప్పందాన్ని కూడా కుదుర్చుకున్నారు. ఈ ఒప్పంద పత్రాలపై ఆర్‌ఈసీ లిమిటెడ్ చీఫ్ ప్రోగ్రామ్ మేనేజర్ తారా రమేష్, కంచి కామకోటి చైల్డ్ ట్రస్ట్ హాస్పిటల్ సీఈవో ఎస్.రంగరాజన్, ఆర్‌ఈసీ ఇండిపెండెంట్ డైరెక్టర్ నారాయణన్ తిరుపతి, కేకేసీటీహెచ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జనని శంకర్ సమక్షంలో సంతకాలు చేశారు. అధునాతన బయో మెడికల్ పరికరాలను కొనుగోలు చేసేందుకు ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయని, ఇందులో ఐసీయూ వార్డులకు వెంటిలేటర్లు, అధునాతన ఈఎన్‌టీ ఆపరేషన్లు చేయడానికి ఉపయోగించే లేజర్ యంత్రాలు ఇలా వివిధ కీలక పరికరాలను కొనుగోలు చేస్తారని ఆర్‌ఈసీ తారా రమేష్ అభిప్రాయపడ్డారు.


రికార్డు స్థాయిలో చెన్నై, ఎన్నూరు పోర్టుల ఆదాయం



మీడియాతో మాట్లాడుతున్న పోర్ట్ ట్రస్ట్ వైస్ చైర్మన్ సునీల్ బాలీవాల్

అడయార్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చెన్నై హార్బర్,ఎన్నూరు కామరాజర్ పోర్టులకు రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరిందని చెన్నై పోర్ట్ ట్రస్ట్ వైస్ చైర్మన్ సునీల్ బాలీవాల్ వెల్లడించారు.గురువారు రెండు పోర్టుల ఉన్నతాధికారులతో కలిసి ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ, 2024-25 ఆర్థిక సంవత్సరంలో చెన్నై పోర్టు, ఎన్నూరు కామరాజర్ పోర్టులు రికార్డు స్థాయిలో రూ.1000 కోట్ల మేర ఆర్జించాయని వెల్లడించారు. ఈ రెండు పోర్టుల్లో 103.36 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు హ్యాండ్లింగ్ జరిగిందన్నారు. చెన్నై హార్బర్ 54.96 మిలియన్ మెట్రిక్ టన్నులు, కామరాజ్ హార్బర్‌లో 48.41 మెట్రిక్ టన్నుల సరుకు ఎగుమతి, దిగుమతి చేయడం జరిగిందన్నారు. మొత్తంగా ఈ యేడాది 6.7 శాతం సమగ్ర వృద్ధి సాధించినట్టు పేర్కొన్నారు. చెన్నై హార్బరులో 6.5 శాతం, ఎన్నూరు కామరాజర్ హార్బరులో 6.9 శాతం వృద్ధి సాధించినట్టు వెల్లడించారు. 2025 మార్చి నెలలోనే గతంలో ఎన్నడూ లేనివిధంగా 4.58 మిలియన్ టన్నుల సరకును హ్యాండ్లింగ్ చేశామని వివరించారు.

ఎక్స్‌ప్రెస్ అవెన్యూలో 'బాంబే షర్ట్ షోరూం'



షోరూం ప్రారంభోత్సవ దృశ్యం

చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటలోని ఎక్స్‌ప్రెస్ అవెన్యూలో 'బాంబే షర్ట్ కంపెనీ' షోరూం ఏర్పాటైంది. దీనిని ఇటీవల సంస్థ సీఈవో చిప్పీ ఆదిత్య మెహతా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మైలాపూర్‌లో తమ ప్రథమ స్టోర్ వుందని, ఇప్పుడు ఎక్స్‌ప్రెస్ అవెన్యూలో రెండో స్టోర్ ప్రారంభించడం సంతోషంగా వుందన్నారు. ఇదిలా వుండగా ఈ షోరూంలో కస్టమ్-మేడ్ షర్టులతో పాటు రెడీమేడ్ షర్టులు, టైలర్-మేడ్ బ్లేజర్లు, జీన్స్, చినోస్, జాగర్స్ వంటివి అందుబాటులో వున్నాయని తెలిపారు.



దేవేరులతో అలంకార ప్రియుడు



రజత కవచ అలంకారంలో గరుడాళ్వార్

ఆధ్యాత్మికం



ఆలయ ప్రవేశద్వారం

నవగ్రహాల్లో శుక్రస్థలం

మయబ్రహ్మ తపమాచరించిన తీర్థం

● శంఖు, చక్రాలతో గరుడాళ్వార్ దర్శనమిచ్చే దివ్య క్షేత్రం

● 'వెళ్ళియంగుడి' కోలవిల్లి రామాలయం





చతుర్భుజాలతో దర్శనమిస్తున్న గరుడాళ్వార్ - తాయార్ మరకతవల్లి

అష్టోత్తర శత వైష్ణవ దివ్యక్షేత్రాల్లో 22వది తంజావూరు జిల్లాలోని తిరు వెళ్ళియంగుడి కోలవిల్లి రామాలయం. వామనావతారంతో సంబంధం ఉన్న ఈ క్షేత్రం నాలుగు యుగాల్లోనూ భక్తులచే పూజలందుకున్నట్టు స్థలపురాణం చెబుతోంది. వైష్ణవాలయాల్లోనే శంఖు, చక్రం ధరించి చతుర్భుజాలతో గరుడాళ్వార్ దర్శనమిచ్చే అరుదైన క్షేత్రం . ఈ ఆలయం వద్ద నల్లరాతి నేలలో కదళీవృక్షం యేడాదికొకమారు మాత్రమే అరటిగెల వేయటం అరుదైన విషయం. విష్ణుపురాణం, బ్రహ్మాండపురాణంలో ఈ క్షేత్ర విశేషాల ప్రస్తావన ఉంది. ఈ క్షేత్ర ప్రాశస్త్యంపై తిరుమంగైయాళ్వార్ మంగళాశాసనమొనర్చారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

స్థలపురాణం... : మహావిష్ణువు వామనావతారం దాల్చి మూడడుగుల నేలను దానంగా ఇవ్వాలని బలిచక్రవర్తిని కోరారు. దానికి బలిచక్రవర్తి కూడా అంగీకరించారు. ఆ సమయంలో వామనుడి అవతారంలో వచ్చింది సాక్షాత్తు మహావిష్ణువేనని గ్రహించిన శుక్రాచార్యుడు కందిరీగ రూపం దాల్చి కమండల ద్వారంలో దూరి జలం బయటకు రాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తారు. వామనావతారంలో ఉన్న మహావిష్ణువు దర్భపుల్లతో కమండలం ద్వారంలోకి నెట్టడంతో కందిరీగ రూపంలో ఉన్న శుక్రాచార్యుడు ఓ కన్ను కోల్పోయాడు.

మూలవిరాట్టు నామధేయం : కోలవిల్లి రామర్, శ్రీరామాబ్ది
ఉత్సవమూర్తి నామధేయం : శృంగార సుందరర్
తాయార్ నామధేయం : మరకతవల్లి, స్థల వృక్షం : అరుణ కదళీవృక్షం
తీర్థం : శుక్రతీర్థం, బ్రహ్మతీర్థం, పరశురామతీర్థం, ఇంద్రతీర్థం
విమానం : పుష్కళా వర్తక విమానం

మళ్ళీ కంటిచూపు పొందటానికి శుక్రాచార్యులు ఎన్నో క్షేత్రాలను దర్శించాడు. చివరగా ఈ క్షేత్రానికి వచ్చి శ్రీరామచంద్రమూర్తిగా దర్శనమిస్తున్న పెరుమాళ్‌ను దర్శించి నేత్రదృష్టిని తిరిగి పొందాడు. శుక్రాచార్యుడు బసచేసిన స్థలం కనుక తమిళంలో ఈ క్షేత్రాన్ని 'వెళ్ళియంగుడి' (శుక్రుడి తమిళ నామం వెళ్ళి అంటే వెండి లేదా రజతం) అని పిలుస్తున్నారు.

కోలవిల్లి రాముడు... : దేవ శిల్పి విశ్వకర్మ పెరుమాళ్‌కు ఎన్నో ఆలయాలను నిర్మించాడు. అదే సమయంలో అసుర శిల్పి మయుడు పెరుమాళ్ ఆలయాన్ని నిర్మించలేకపోవడం పట్ల చింతించాడు. ఆ విషయమై బ్రహ్మదేవుడికి మొరపెట్టుకున్నాడు. బ్రహ్మదేవుడు వెళ్ళియంగుడి క్షేత్రానికి వెళ్లి తపమాచరిస్తే అతడి కోరిక నెరవేరుతుందని సలహా ఇచ్చాడు. బ్రహ్మదేవుడి సలహా మేరకు మయుడు ఈ క్షేత్రంలో ఘోరతపస్సు చేశారు.. ఆ తపస్సును మెచ్చి మహావిష్ణువు శంఖు, చక్రధారిగా చతుర్భుజాలతో మయుడి ఎదుట ప్రత్యక్షమయ్యారు. మయుడు ఆనందంగా శ్రీరాముడిగా తన ఎదుట ప్రత్యక్షం కావాలని మహావిష్ణువును వేడుకున్నాడు. మహావిష్ణువు వెంటనే తన శంఖు, సుదర్శన చక్రాన్ని గరుత్మంతుడికి ఇచ్చి, మయుడి ఎదుట శ్రీరామచంద్రుడిగా దర్శనమిచ్చారు.

ఆలయ వైభవం...

ఈ ఆలయం వెయ్యేళ్లనాటిదని పురావస్తు పరిశోధకులు నిర్ధారించారు. ఆలయంలో పెరుమాళ్ (శ్రీరామచంద్రమూర్తి) తూర్పు దిశగా శయన భంగిమలో దర్శనమిస్తున్నారు. ఇక ఈ స్వామివారు అలంకార ప్రియుడు కనుక ఆలయంలోని ఉత్సవమూర్తిని 'శృంగార సుందరుడు' అని పిలుస్తారు. ఈ క్షేత్రాన్ని పరాశరమునులు, మార్కండేయుడు, ఇంద్రుడు, బ్రహ్మదేవుడు, భూదేవి దర్శించారు. కంచి పరమాచార్యులు ఈ క్షేత్రంలోనే కొద్ది రోజులపాటు బసచేసి ఆలయ జీర్ణోద్ధరణ పనులను పర్యవేక్షించారు. ఈ క్షేత్రం కృతయుగంలో 'బ్రహ్మపుత్రం' అని, ద్వాపరయుగంలో 'సైంద్రనగరం' అని, త్రేతాయుగంలో 'పరాశరం' అని పిలిచేవారు. ప్రస్తుత కలియుగంలో 'భార్గవపురం' అని పిలుస్తున్నారు. ఈ క్షేత్రానికి సమీపంలోని చెంగనూరులోనే వైష్ణవాచార్యులు 'పెరియవాచ్చాన్ పిళ్లై' అవతరించారు.

శుక్రస్థలం... : తిరు వెళ్ళియంగుడి పెరుమాళ్‌ను దర్శిస్తే అష్టోత్తర శత వైష్ణవ దివ్యక్షేత్రాలను దర్శించినంత పుణ్యఫలం దక్కుతుందన్నది ఐతిహ్యం. కంటి చూపును కోల్పోయి అలమటించిన తనకు నేత్ర దృష్టిని ప్రసాదించిన పెరుమాళ్‌కు కృతజ్ఞతలు తెలియజేసేలా శుక్రాచార్యుడు ఈ ఆలయంలో ఆరని జ్యోతిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. కనుకనే ఈ ఆలయం నవగ్రహాల్లో శుక్రస్థలంగా కీర్తి గడించింది.

ఆలయ ఉత్సవాలు... : ఈ ఆలయంలో శ్రీరామనవమి, కృష్ణజయంతి, నవరాత్రి, కార్తీక దీపోత్సవం, వైకుంఠ ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఆ వేడుకలలో పెరుమాళ్‌కు ప్రత్యేక తిరుమంజనాలు, ఆరాధనలు నిర్వహిస్తారు. ఆ ఉత్సవాల్లో వివిధ వాహన సేవల్లో స్వామివారు ఊరేగి భక్తులకు కనువిందు చేస్తారు.

ఎలా వెళ్లాలి? : రాష్ట్రంలోని ప్రధాన నగరాల నుండి కుంభకోణం నగరానికి ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు నడుపుతున్నారు. కుంభకోణం చేరుకుంటే అక్కడి నుండి 16 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. కుంభకోణం బస్‌స్టేషన్ నుండి ఆటోలు, టాక్సీలు, టౌన్ బస్సుల్లో ఆలయానికి చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 నుండి రాత్రి 7 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



ఇష్టదేవేరులతో శృంగార సుందరర్ స్వామి

రూ.10 కోట్లతో 500 ఆవిన్ పార్లర్లు

● మంత్రి రాజకన్నప్పన్ ప్రకటన



ప్యారీస్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.10 కోట్లతో కొత్తగా 500 ఆవిన్ పార్లర్లు ప్రారంభించేలా చర్యలు చేపట్టినట్లు పాడిపరిశ్రమల శాఖామంత్రి ఆర్‌ఎస్ మంత్రి రాజకన్నప్పన్ ప్రకటించారు. రాష్ట్ర అసెంబ్లీలో గురువారం ఉదయం పాడిపరిశ్రమలకు సంబంధించి కొత్త ప్రకటనలు విడుదల చేసిన అనంతరం మంత్రి రాజకన్నప్పన్ అందులోని విశేషాలను సభకు వివరించారు. పాల ఉత్పత్తిదారులు ఆవిన్ సంస్థకు సరఫరా చేస్తున్న రూ.9.34 కోట్ల మేర పాల నాణ్యత పరిశీలించి అప్పటికప్పుడే అనుమతిచ్చేందుకు 1,437 క్లౌడ్ పాల నాణ్యత పరిశోధన పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ.6.45 కోట్లతో కల్తీ పాలను గుర్తించే 129 ఆధునిక పరికరాలను ఆవిన్ కేంద్రాలకు సరఫరా చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో పండుగ సీజన్లలో లాగే ఆవిన్ ఉత్పత్తుల విక్రయాలను పెంచేందుకు అదనంగా మరో 500 పార్లర్లను ప్రారంభించే చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. పాడిపశువులను పోషిస్తూ, సహకార సంఘాలకు పాల సరఫరా చేస్తున్న రైతులకు రూ.2వేల కోట్ల మేర రుణాలు ఇచ్చేలా ప్రభుత్వం అనుమతిచ్చినట్లు తెలిపారు. 14 జిల్లా కేంద్రాల్లో రూ.2.40 కోట్లతో 30 పాల శీతలీకరణ కేంద్రాలకు మరమ్మత్తులు చేపట్టనున్నట్లు తెలిపారు. చెన్నై మాధవరంలోని ఆవిన్ ప్రధాన పరిశోధనా కేంద్రానికి రూ. 2.33 కోట్లతో పరిశోధనా పరికరాలు పంపిణీ చేయడంతో పాటు, రూ.2.63 కోట్లతో 525 ప్రాథమిక పాల ఉత్పత్తిదారుల సంఘాలను కంప్యూటరీకరణ చేయనున్నట్లు తెలిపారు. పాడిపశువులకు కొరతలేకుండా మేత సమకూర్చుకునే విధంగా పాల ఉత్పత్తిదారులకు రూ.72 లక్షలతో విత్తనాలు మొక్కలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. మాధవరం, వేలూరు, విల్లుపురం తదితర ప్రాంతాల్లోవున్న ఆవిన్ శిక్షణా కేంద్రాల్లో రూ.2.38 కోట్లతో వసతులు మెరుగు పరుచుట, ఆవిన్ పాల ఉత్పత్తుల నాణ్యతా రుచిని పెంచేందుకు పథకం రూపొందించినట్లు మంత్రి రాజకన్నప్పన్ అసెంబ్లీలో తెలిపారు.